రేపటి నుంచి ఆరోగ్య సురక్ష క్యాంపులు

మడకశిరరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో రేపటి (మంగళ వారం) నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకూ రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 2న హరేసముద్రం పంచాయతీ కేంద్రంలో, 9న ఆర్ ఆనంతపురం, 23న ఆమిదాలగొంది -1, 30న కదిరేపల్లి, ఫిబ్రవరి 6న జీవీపాళ్యం, 13న మెళవాయి, 20న బుళ్లసముద్రం, 27న హరేసముద్రం -2లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే మార్చి 5న ఛత్రం, 12న గొడనహళ్లి, 19న వైబీహళ్లి, 26న మణూరు, ఏప్రిల్ 2న గోవిందాపురం, 16న చెందకచెర్లు, 23న ఆమిదాలగొంది-2, 30న సీ కొడిగేపల్లి పంచాయతీల కేంద్రాల్లో వైద్యాశాఖ ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించే పంచాయతీలో 15 రోజుల ముందుగానే ఆశ, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సంరక్షణ సేవలపై ప్రజలకు తెలియజేస్తారన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

పరిగి: మండల కేంద్రమైన పరిగిలో ఆదివారం శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీసత్య సాయి విద్యా సంస్థ పూర్వ విద్యార్థి గుణరంజన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుట్టపర్తి, బెంగళూరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల స్పెషలిష్టులతో పాటు కర్నూలుకు చెందిన వైద్యాధికారుల నేతృత్వంలో వివిధ జబ్బులకు బాధపడుతున్న రోగులను పరిశీలించారు. మొత్తం 270 మందికి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ సీఆర్ రావు తెలిపారు. వారిలో 20 మందిని పుట్టపర్తి, బెంగళూరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో హిందూపురం, పరిగి మండలాల భజన, సమితీల కన్వీనర్లు శ్రీక్రాంత్, నరసీయప్ప, సమితి భజన మండలి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

'పురం'లో...

హిందూపురం టౌన్: కిమ్స్ సవేరా ఆస్పత్రి, పుష్పగిరి ఐ ఆస్పత్రి సహకారంతో స్థానిక మణిశరణ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ చలపతి ఆధ్వర్యంలో పట్టణంలోని మధుర మీనాక్షి కల్యాణ మండలపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని వైద్యులు పరీక్షించి, మందులను ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది చంద్ర, డాక్టర్లు ఇమ్రాన్, షాహిద్, బంగారు చంద్ర, రిటైర్డ్ తహసీల్దార్ శివన్న, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

అగళి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: మండల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ హుస్సేన్‌పీరా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమస్యాత్మక గ్రామాలపై గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా కేసులపై ఆరా తీశారు. శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఊపేక్షించేది లేదన్నారు. సమావేశంలో సీఐ సురేష్ బాబు, ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డివిజన్ స్థాయి 'స్పందన'

అగళి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన, జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జమానూల్లాఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొంటారని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

హద్దు మీరితే చర్యలు

గోరంట్ల: మండల వ్యాప్తంగా ప్రజలు సోమవారం నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలి. వేడుకల్లో ఎక్కడైనా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవు' అని గోరంట్ల సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, గుంపులుగా చేరి నడిరోడ్డుపై వేలుకలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏ ఒక్కరు వ్యవహరించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా పోలీసు యాక్టు 30 అమలులో ఉందన్నారు.

గ్రానైట్ లారీ సీజ్



లారీని సీజ్ చేసిన దృశ్యం

మడకశిర: గుడిబండ మండలం నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న లారీని ఆదివారం మడకశిరలో సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్ తెలిపారు. సీజ్ చేసిన గ్రానైట్ లారీని గనులశాఖ అధికారులకు అప్పగించామన్నారు. నియోజకవర్గంలో అక్రమంగా గ్రానైట్‌ను లారీల్లో తరలిస్తున్నారని, ఈ నేపథ్యంలో నిఘా పెంచినట్లు పేర్కొన్నారు.

వేడుకగా కనకదాస జయంతి



కనకదాస జయంత్యుత్సవంలో పాల్గొన్న కురుబ కులస్తులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఉప్పిడిపల్లిలో ఆదివారం కురుబ కులస్తుల ఆరాధ్యదైవం కనకదాస జయంతి వేడుకలను కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటానికి పూలమాలు వేసి పూజలు చేశారు. మహిళలు జ్యోతులను కనుకదాసు చిత్రపటం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. కురుబ కులస్తులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా ప్రోత్సహించాలని నాయకులు సూచించారు.

వాల్మీకుల అభ్యున్నతికి కృషి



జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

మడకశిర: వాల్మీకుల అభ్యున్నతికి అంజనేయులు ఎంతగానో కృషి చేశారని వక్తులు పేర్కొన్నారు. ఆదివారం మడకశిరలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు గంగవరం ఆంజనేయులు ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు, ప్రముఖులు ఆయన సమాధికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకుడు అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు వైటీ ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, ఈరన్న, నాగరాజరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, వాల్మీకి సంఘం జిల్లా నాయకుడు ప్రభాకర్, బీజేపీ నాయకుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆంజనేయులు కుమారుడు మోహన్‌కుమార్‌ని ఘనంగా సన్మానించారు. వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అలాగే వాల్మీకి జయంతి సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ ఈరన్న, గుడిబండ జేసీఎస్ కన్వీనర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

హిందూపురం: అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ ఆర్థికసాయంతో ఉమర్ ఫారూక్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సేవా మందిరంలోని దాదాపు 65 మంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివారం సేవా మందిరంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ముతవల్లీ తల్హాఖాన్, ఉబెదుల్లాహుసేన్, టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘ నాయకులు షేక్ షబ్బీర్, ముజ్జు, హాజీ నాసిర్. హాజీ చాంద్ బాషా, న్యాయవాది వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోరెగాంవ్ యుద్ధవీరులకు నివాళి



యుద్ధ వీరులకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

పావగడ: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కోరెంగావ్ యుద్ధ వీరుల సంస్మరణార్థం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దళిత నాయకులు యుద్ధ వీరులకు నివాళులర్పించారు. ఇందులో భాగంగానే సేనాధిపతి సిద్ధనాక మకలనాక చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాదిగ దండోరా తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ, పెద్దన్న, నరసింహప్ప, తిప్పేస్వామి, వళ్లూరు నాగేశ్, మంజునాథ్, కృష్ణమూర్తి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణకు సహకరించండి



పట్టణంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

హిందూపురం: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమీషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఆదివారం ఉదయం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనుల నిర్వాహణ పరిస్థితులను తనిఖీ చేశారు. పలు ప్రాంతాల్లో పరిశీలించి రోడ్లపై పారవేస్తున్న చెత్తా చెదారం, మురుగు చూసి ప్రజలు, దుకాణదారులతో మాట్లాడారు. పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. చెత్త చెదరాలను రోడ్లపై, కాలువల్లో పారవేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే పారిశుధ్య సిబ్బందికి సూచలిచ్చారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించాచా. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

బేకరీల్లో తనిఖీలు

అనంతపురం క్రైం: నగరంలోని బేకరీలు, స్వీట్స్ దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ప్యాకేజీ తినుబండారాలపై తయారీదారుడి పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేయాల్సిన పేరు,చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలు ముద్రించకపోవడంతో జరిమానా విధించారు. అధిక ధరలకు కూల్ డ్రింక్ అమ్ముతున్నందుకు, కేక్‌లు తక్కువ తూకం ఉండడంతో మొత్తం 11 కేసులు నమోదు చేసి, 7 కేసులకు గాను రూ. 60 వేలు జరిమానా విధించారు. తనిఖీలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక



పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అండర్-14, అండర్-16 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఆదివారం నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన వారు ఫిబ్రవరి 16,18 తేదీల్లో గుజరాత్‌లో జరగబోవు పోటీల్లో పాల్గొంటారని, అథ్లెటిక్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ జిల్లా చైర్మన్ డి. ఇస్మాయిల్, కన్వీనర్ డి.రవికుమార్ పేర్కొన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



స్వామిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని నిజవల్లిలో చిత్రలింగేశ్వరస్వామి,ఈరన్న స్వామి గ్రామోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. సోమవారం బెస్తరపల్లిలో బొమ్మలింగేశ్వర స్వామి ఉత్సవం నిర్వహించనున్న తరుణంలో యాదవులు నిజవల్లి గ్రామం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని బొమ్మలింగేశ్వరస్వామి ఆలయం వరకూ గ్రామోత్సవంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటంపల్లి, నిజవల్లి, జంబుగుంపల, బెస్తరపల్లి గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

ఆంజనేయ రథోత్సవం




చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరంలోని నూలాలప్పన దిన్నెలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి పూజలను నిర్వహించారు. నిర్మలానందనాథ స్వామి పాల్గొన్నారు. తరువాత తేరులో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయం చుట్టూ ఊరేగించారు. తేరుపై స్వామీజీ శనక్కాయలను చల్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా శనక్కాయల పరుసను ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ సీఎం బసవరాజ బొమ్మై, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు



అనంతపురం నగరంలో కొత్తగా నిర్మించిన టవర్‌క్లాక్ బ్రిడ్జి



శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్ అకాడమీ

- గడిచిన నాలుగున్నరేళ్లలో ఉమ్మడి జిల్లాకు భారీ ప్రాజెక్టులు
- రూ.3వేల కోట్లతో కొనసాగుతున్న జాతీయ రహదారి ప్రాజెక్టులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గడిచిన నాలుగున్నరేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ ప్రాజెక్టులు చేపట్టిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని అనంతపురం నగరం ఇప్పుడు టవర్‌క్లాక్ బ్రిడ్జితో పాటు గుత్తిరోడ్డు విస్తరణ ప్రాజెక్టు పనులు పూర్తయి ట్రాఫిక్ నియంత్రణ సులభతరమైంది. పలు జాతీయ రహదారి పనులతో పాటు హైడ్రో ప్రాజెక్టులు చేపట్టారు. భవిష్యత్ తరాలకు భారీ మేలు జరిగేలా శింగనమల నియోజకవర్గంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో రూ.4,500 కోట్లతో హైడ్రో ప్రాజెక్టు చేపడుతున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో నాసిన్..

దేశంలోనే అత్యున్నత సంస్థగా చెప్పుకోదగ్గ నాసిన్ (నేషనల్ అకాడెమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్) సంస్థ పాలసముద్రం దగ్గర 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఇక్కడ దేశవ్యాప్తంగా సివిల్స్‌లో ఎంపికయ్యే ఐఆర్‌ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఏపీ ప్రభుత్వం ఈ సంస్థకు 500 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.600 కోట్లతో సంస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఈ ప్రాంతంలోని భూములకు భారీగా ధరలు పలకడంతో పాటు ఉద్యోగావకాశాలు రానున్నాయి.

పెనుకొండకు మెడికల్ కాలేజీ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండకు వెనుకబడిన ప్రాంతంగా పేరుంది. అందుకే ప్రభుత్వం మెడికల్ కాలేజీని రూ.375 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీ వల్ల చుట్టుపక్కల ప్రాంతాలకు మెరుగైన స్పెషాలిటీ వైద్యం అందడమే కాకుండా 100 ఎంబీబీఎస్ సీట్లుకూడా రానున్నాయి. మరో రెండేళ్లలో ఈ కళాశాల అందుబాటులోకి రానుంది.

తీరిన అనంత కష్టాలు..

అనంతపురంలో ఏళ్లుగా టవర్‌క్లాక్ బ్రిడ్జి పెద్ద సమస్యగా ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎవరూ పట్టించుకోలేదు. టవర్‌క్లాక్ బ్రిడ్జితో పాటు పంగల్‌రోడ్డు వరకూ 9 కిలోమీటర్ల పైన రోడ్డు రూ.319 కోట్లతో గడువుకుముందే పూర్తిచేసి సర్కారు రికార్డు సృష్టించింది. అంతేకాదు 5 కిలోమీటర్ల పొడవునా గుత్తిరోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి అనంతపురం ప్రజల చిరకాల వాంఛ నెరవేరేలా చేసింది.

800 మెగావాట్లతో హైడ్రో ప్రాజెక్టు..

శింగనమల నియోజకవర్గం నాయనిపల్లి క్రాస్ దగ్గర భారీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం స్థాపిస్తున్నారు. ఇటీవలే ప్రజాభిసేకరణ పూర్తయ్యింది. 480.65 హెక్టార్లలో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టుకు రూ.4,676.64 కోట్ల వ్యయం చేస్తున్నారు. ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు సాగు, తాగునీరు కొదువ లేకుండా ఉంటుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో వెల్లువలా పరిశ్రమలు..

శ్రీసత్యసాయి జిల్లాలో పరిశ్రమలు వెల్లువలా వచ్చాయి. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో వేలాదిమందికి ఉపాధి లభించింది. గడిచిన నాలుగేళ్లలో 8,997 ఎంఎస్ఎంఈలు (పరిశ్రమలు) ఏర్పాటయ్యాయి. దీనిద్వారా రూ.836 కోట్ల పెట్టుబడులు రాగా, 33 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. దీంతో పాటు మరో 21 భారీ, మధ్యతరహా పరిశ్రమలూ వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులు

కేటగిరీ	ప్రాజెక్టు పేరు	వ్యయం	పనుల స్టేటస్
రోడ్డు-బ్రిడ్జి	టవర్‌క్లాక్ బ్రిడ్జి	రూ.319 కోట్లు	పూర్తి
రోడ్డు విస్తరణ	గుత్తి రోడ్డు	రూ.90 కోట్లు	పూర్తి
జాతీయ రహదారి	అనంత-ముచ్చుకోట	రూ.676 కోట్లు	ఆన్‌గోయింగ్
జాతీయ రహదారి	ముచ్చుకోట-తాడిపత్రి	రూ.750 కోట్లు	ఆన్‌గోయింగ్
కేంద్ర శిక్షణ కేంద్రం	నాసిన్	రూ.600 కోట్లు	పూర్తి
విద్యుత్ ప్రాజెక్టు	నాయనిపల్లి హైడ్రో ప్రాజెక్టు	రూ.4,676.64 కోట్లు	ప్రాథమింగా
పరిశ్రమలు	ఎంఎస్ఎంఈ	రూ.836 కోట్లు	ఇన్వెస్ట్ పూర్తి
పరిశ్రమలు	ఎంఎస్ఎంఈ ఉద్యోగాలు	33,556	పూర్తి
మెడికల్	పెనుకొండ ప్రభుత్వ వైద్య కళాశాల	రూ.375 కోట్లు	ఆన్‌గోయింగ్

అందరికీ మంచి జరగాలి

- వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక



హిందూపురం: నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సేవకురాలుగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్యనైనా ముందుండి పరిష్కారించడానికి కృషి చేస్తామన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి కంకణ బద్ధులై ఉన్నామని, రానున్న కాలంలో హిందూపురం నియోజకవర్గాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తామన్నారు.

తీసుకున్న అప్పు అడిగినందుకే హత్య

- ఉపాధ్యాయురాలి హత్య కేసు ఛేదించిన పోలీసులు

హుబ్లీ: నగరంలో విశ్రాంత ఉపాధ్యాయిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార విలేకరులకు వివరాలు వెల్లడించారు. ధార్వాడ హోం నగరకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని గిరిజ (63) డిసెంబర్ 15న హత్యకు గురైంది. గిరిజ, మంజునాథ్ అనే వ్యక్తికి రూ. 10 లక్షలు అప్పుగా ఇచ్చింది. తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని గిరిజ, మంజునాథ్‌ను కోరింది. ఆమె తరచూ నిలదీస్తుండటంతో డిసెంబర్ 15న మంజునాథ్... గిరిజ ఇంటికి వచ్చాడు. నీరు కావాలని అడగడంతో గిరిజ లోపలికి వెళ్లిన సమయంలో ఆమె వెనుకనే వచ్చి టవల్‌తో గొంతు బిగించి హత్య చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. వారం రోజుల తరువాత దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణ చేపట్టిన పోలీసులు మంజునాథ్‌పై నిఘా ఉంచి అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెల్లడించినట్లు కమిషనర్ తెలిపారు.

ఆన్‌లైన్ మోసం, రూ. 15 లక్షల టోకరా

హుబ్లీ: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న ప్రజల్లో చైతన్యం రావడం లేదు. తాజాగా నగరం రెండు వేర్వేరు ఘటనలో ఇద్దరికి రూ.15.72 లక్షలు టోకరా వేశారు. వివరాలు... స్థానికంగా ఉంటున్న సతీశ్ అనే వ్యక్తికి ఎనీడెస్క్ యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని సందేశం వచ్చింది. ఇదే సమ యంలో ఆన్‌లైన్ కేటుగాడు ఫోన్ చేసి రెట్టింపు నగదు పొందవచ్చని ఆశ చూపాడు. దీంతో సతీశ్ గుడ్డిగా రూ. 8.24 లక్షలు అతను సూచించిన ఖాతాలకు జమ చేశాడు. అనంతరం అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో వర్క్‌ఫ్రం హోంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లా భాలు వస్తాయంటూ మురార్జీ నగర నివాసి రవిచవాన్‌ను నమ్మించి గుర్తు తెలియని వ్యక్తి 7.46 లక్షల దోచుకున్నాడు. సైబర్ పోలీసులు కేసులు దర్యాప్తు చేపట్టారు.

పెద్దమ్మ దేవతకు పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ పూజారి బండారు దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలు, పూలమాలలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం: పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, నూతన సంవత్సర కేలండర్‌ను జేఎన్‌టీయూఏ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింక రంగ జనార్దన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్, నాయకులు శివరుద్రప్ప, జిల్లా అధ్యక్షుడు జింక సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి సురేష్, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబరమంటిన గిరిజన ఉత్సవం



మైసూరు కళామందిరంలో గిరిజన సంప్రదాయ నృత్యం



ఆకట్టుకునే విచిత్ర వేషధారణ

మైసూరు: అటవీ ప్రాంతాల్లో గిరిజనుల జీవన విధానం, వారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే గిరిజన ఉత్సవం అంబరమంటింది. మైసూరు నగరంలోని కళా మందిరం ఆవరణలో ఉన్న కిరు రంగమందిరంలో కన్నడ సంస్కృతి శాఖ గిరిజన ఉత్సవం-2023 పేరుతో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా గిరిజనులు జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. దొడ్డ మారనహళ్ళి డి.కే. లోకేష్, బృందం సంగీతం , హెచ్.డి.కోటె ప్రజల నాయకుడు బృందం జానపద గీతాలు, రాజేశ్వరి బృందం భక్తి గీతాలు, నంజనగూడు కళళె గ్రామం దేవణ్ణసి. బృందం తత్వపద, రమ్య బృందం డొల్లు కుణితతో ప్రజలను రంజింప చేశారు. గిరిజన మహిళలు విచిత్ర వేషధారణ, సంప్రదాయ నృత్యాలతో అలరించారు. అంతకుముందు ఈ వేడుకలను కన్నడ సంస్కృతి శాఖ, జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.మల్లికార్జున ప్రారంభించారు.





జానపద నృత్యాలు

బళ్లారిలో యువకుడి దారుణహత్య

సాక్షి,బళ్లారి: బళ్లారి నగరంలోని వడ్డెరబండలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు.. నగరానికి చెందిన ఫైదుల్లా (25) అనే వ్యక్తి తన తమ్ముడు రజాక్ వలితో కలిసి కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా కేక్ కొనడానికి బైక్‌లో వెళ్తుండగా పాండు రంగస్వామి ఆలయ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఘటనలో ఫైదుల్లా తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రజాక్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బ్రూస్‌పేట్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఒకవైపు కొత్త సంవత్సర వేడుకలు జరుపుతుండగా హత్య జరగడం కలకలం రేపింది.

బాబా ఫక్రుద్దీన్ జెండా ఊరేగింపు



జెండా ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెనుగొండ హజరత్ బాబా ఫక్రుద్దీన్ ఉరుసును పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పాత బజారులో ఉన్న పెనుగొండ బాబా ఫక్రుద్దీన్ జెండా కట్ట వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశేష పుష్పాలతో అలంకరించిన జెండాను పట్టణంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పేకాట కేంద్రంపై దాడి

అనంతపురం క్రైం: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయక్ నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట నిర్వహిస్తుండడంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 33 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

ఉత్తర గాలిగోపురానికి ముఖ ద్వారం ఏర్పాటు

కూడేరు: మండల కేంద్రంలో ప్రఖ్యాతిగాంచిన శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రానికి బళ్లారికి చెందిన భక్తుడు బసన్న గౌడ్ సుమారు రూ.80 లక్షలతో ఉత్తర, దక్షిణ గాలిగోపురాలను నిర్మిస్తున్నారు. ఆదివారం ఉత్తర గాలి గోపురానికి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. గోపురాల నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరగా గోపురాల నిర్మాణపు పనులు పూర్తి చేసి జోడు లింగాల ఆలయానికి నూతన శోభను తీసుకురావాలన్నదే తన కోరిక అని నిర్మాణ కర్త బసన్న గౌడ్ తెలిపారు. నిర్మాణపు పనులు సజావుగా సాగేందుకు ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

దశ భుజ మహా గణపతికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఉన్న దశభుజ మహాగణపతి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

'నూతన' ఉత్సాహం



చిలమత్తూరులో ఓ బేకరీ వద్ద గుమిగూడిన జనం



మడకశిర పట్టణంలో ఓ బేకరీ వద్ద సందడి



హిందూపురంలో న్యూయర్ వేడుకలకు సిద్ధమైన చర్చి

సాక్షిబృందం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆదివారం మార్కెట్లు కిటకిటలాడాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో కేక్‌లు, బట్టల దుకాణాలు, బొకేలు, స్వీట్లు కొనుగోలు చేసే వారితో ప్రధాన రహదారుల్లో రద్దీ నెలకొంది. అర్ధరాత్రి సమయంలో ప్రత్యేకంగా కేక్‌లను కట్ చేసుకొని నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. మరోవైపు అన్ని చర్చిల్లో అర్ధరాత్రి నుంచే న్యూయర్ వేడుకలు ప్రారంభమయ్యాయి. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మరోవైపు ఆలయాల్లో కూడా దర్శనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేక్‌లు

ఘనంగా ఇమామ్‌షావలి ఉరుసు


విద్యుత్‌కాంతులతో హజరత్ ఇమామ్‌షావలి దర్గా


దర్గాలో చక్కెర చదివిస్తున్న భక్తులు


హజరత్ ఇమామ్‌షావలి సమాధి


చిన్నారిని తులాభారం చేస్తున్న తల్లిదండ్రులు

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో హజరత్ ఇమామ్‌షావలి ఉరుసు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఉరుసుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో దర్గా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు తమ ఆరాధ్యదైవమైన హజరత్ ఇమామ్‌షావలికి చక్కెరను తులాభారమివ్వగా.. మరికొందరు పూలచద్దర్‌ను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అనంతపురం యూనుస్, మాబుపీరా, గంగలాపురం ఫకృద్దీన్, ఆదం సోదరులు దర్గాలో హజరత్ ఇమామ్‌షావలి సమాధిపై నూతన వస్త్రాలు, పూలచద్దర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేయించారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులకు ఆకట్టుకుంది.

క్లుప్తంగా

తనిఖీలు ముమ్మరం చేయాలి


సచివాలయ కార్యదర్శులు, అధికారులతో సమావేశమైన కమిషనర్

హిందూపురం: పట్టణంలోని ఆయా వార్డుల్లోని పారిశుధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సచివాల కార్యదర్శులకు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. ఆదివారం సాయంత్రం సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అన్నివార్డుల్లో హోటల్స్ నిర్వాకులు, దుకాణదారులు, పండ్ల వ్యాపారులు చెత్తలను రోడ్లుపై కాల్వల్లో పారవేయకుండా చూడాలన్నారు. అందరూ డస్ట్ బిన్లు పెట్టుకోవాలని, చెత్తను బయట వేయవద్దని టీ షాపుల యజమానులకు చెప్పాలన్నారు. వినకపోతే ఆయా షాపులు, హోటల్స్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు ఆయా వార్డుల్లో కార్మికులు, పారిశుధ్య కార్యదర్శులు పరిశుభ్రతపై వీక్షిస్తూ దుకాణ పరిసరాలలో పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

చరిత్ర మార్గదర్శకం కావాలి


నొళంబవాడి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: చరిత్రను నేటి సమాజం మార్గదర్శకంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఏపీసీసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. హిందూపురం ఎంజీఎం హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు సిద్ధగిరి శ్రీనివాసులు రాసిన హేమవతి చరిత్రతో రాసిన నొళంబవాడి పుస్తకాన్ని ఆదివారం వాల్మీకి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ చరిత్ర తెలియజెప్పడానికి కృషిచేస్తున్న రచయిత ఉపాధ్యాయుడు సిద్ధగిరి శ్రీనివాసులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో తపన సాహిత్య వేదిక అధ్యక్షులు సడ్లపల్లే చిదంబరరెడ్డి, కేంద్ర సహితీ పురస్కర గ్రహిత నారాయణస్వామి, కవిసమ్మేళ అధ్యక్షులు సురేష్, ఎస్కేయూ తెలుగు విభాగ లెక్చరర్ సదాశివరెడ్డి, ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శేషు సాయి

హిందూపురం టౌన్: స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన అండర్–16 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో హిందూపురానికి చెందిన విద్యార్థి వి.శేషు సాయి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ మహేంద్ర, సంస్థ కార్యదర్శి రామచంద్ర మాట్లాడుతూ కర్నూలులో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో శేషు సాయి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు ఆలయాన్ని నీటితో శుభ్రం చేసి మూల విగ్రహాన్ని పూలతో అలంకరణ చేశారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులకు అన్నదానం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామానికి చెందిన చిన్న తిప్పేస్వామి నుంచి 50 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సునీత తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో ఇంట్లో సోదా చేయగా 50 టెట్రా ప్యాకెట్లు లభించాయన్నారు. నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


మారిగాంభ అమ్మవారు


జ్యోతులు మోస్తున్న భక్తులు

పరిగి: మండలంలోని శిరేకోళం పంచాయతీ పరిధిలోని ధనాపురంలో ఆదివారం మారిగాంభ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం గోపురంపై కలశ స్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయమే మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులు మోశారు. తర్వాత అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బండరాయి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన హనుమంతరాయప్ప

రొళ్ల: ప్రమాదవశాత్తూ బండరాయి తల మీద పడి హనుమంతరాయప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆర్.వడ్రహట్టి చెందిన హనుమంతరాయప్ప కూలీ పనుల నిమిత్తం రొళ్ల పట్టణ సమీపాన రత్నగిరి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఓ ఇంటి చుట్టూ బండరాళ్లు పాతడం కోసం కూలీ పనులకు వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో ఆకస్మాత్తుగా బండరాయి పగిలి తలపై జారి పడడంతో హనుమంతరాయప్ప తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనాల మేరకు మెరుగైన వైద్యం కోసం 108 సహాయం కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం హనుమంతరాయప్ప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

బస్సుయాత్ర సభా స్థలి పరిశీలన


ఉరవకొండ క్లాక్ టవర్ వద్ద బస్సుయాత్ర సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: పట్టణంలోని క్లాక్‌టవర్ ప్రాంతంలో జనవరి 7న మధ్యాహ్నం 2గంటలకు వైఎస్సార్‌సీపీ చేపడుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు సంబంధించిన సభాస్థలిని ఆదివారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు. బస్సుయాత్ర జరిగే రూట్, సభావేదిక స్థలం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా రెండు, మూడు అనువైన స్థలాలను చూసి, వేదిక ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. బస్సు యాత్రలో పాల్గొనే ప్రజానీకానికి అన్ని సౌకర్యాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సుయాత్రకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలోయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ప్రజలే స్వచ్ఛందంగా తరలివచ్చి యాత్ర జయప్రదం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ పట్టణ, మండల సమన్వయకర్తలు ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఉపసర్పంచ్ వన్నప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వృద్ధురాలు మారెక్క తీవ్రంగా గాయపడింది. వివరాలు.. నారాయణపురం గ్రామానికి చెందిన మారెక్క ఆదివారం కుర్లపల్లిలో జరిగిన వివాహ వేడుకకు హాజరై మనవాడితో కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరింది. కుర్లపల్లి గేట్ వద్ద కుక్క అడ్డం రావటంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ మారెక్కను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కదిరిలో...

కదిరి టౌన్: పట్టణంలోని వాణి వీధిలో ఉన్న షిర్డీసాయి బాబా కాలనీకి చెందిన వృద్ధురాలు గంగులమ్మ తీవ్రంగా గాయపడింది. వివరాలు.. ఆదివారం వేమారెడ్డి సర్కిల్‌లో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు వృద్ధురాలిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగులమ్మ చెయ్యి నుజ్జునుజ్జు కావడంతో వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

'సాయి ప్రూడెంట్ టెస్ట్'కు స్పందన


పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి సమీపంలోని బీడుపల్లి వద్ద ఉన్న సంస్కృతీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు ఆదివారం సాయి ప్రూడెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగిన పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు భారీగా హాజరయ్యారు. పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేసి, త్వరలోనే మెరిట్ లిస్ట్‌ను విడుదల చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరులో ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివప్రసాద్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.